సాక్షి వైఎస్ఆర్ జిల్లా

శనివారం । 29 । మార్చి । 2025

I



కార్మికుల పక్షపాతి వైఎస్సార్‌టీయూసీ

వైఎస్ఆర్ టీయూసీ కార్మికుల పక్షపాతి అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్‌టీయూసీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. -IIలో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శని॥ (సా॥)	సహర్ ఆది॥ (ఉ॥)
కడప	: 6.31	4.58
పులివెందుల	: 6.33	5.03
ప్రొద్దుటూరు	: 6.32	5.02

గరిష్టం/కనిష్టం **38.6/24.8**

వాతావరణం

జిల్లాలో శుక్రవారం 24.8 – 38.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.1 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

– కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల్లో నియామకాలు

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్ జిల్లాకు చెందిన కొందరిని రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీల్లో వివిధ హోదాలలో నియమించినట్లు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. స్టేట్ ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శులుగా యు.యోబు, కె.శరత్‌బాబు, స్టేట్ ఎస్సీ సెల్ కార్యదర్శులుగా సి.త్యాగరాజు, కె.భాస్కర్, ఎం.సుబ్బరాయుడు, స్టేట్ వలంటీర్స్ వింగ్ కార్యదర్శులుగా పి.ప్రసాద్‌రెడ్డి, ఎం.సురేష్ , స్టేట్ వలంటీర్స్ వింగ్ జాయింట్ సెక్రటరీగా ఎ.నాగమల్లారెడ్డి, స్టేట్ ఎంప్లాయీస్ అండ్ పెన్షనర్స్ వింగ్ ప్రధాన కార్యదర్శిగా కె. చంద్రశేఖర్‌రెడ్డి, స్టేట్ వీవర్స్ వింగ్ ప్రధాన కార్యదర్శిగా జి.ఆంజనేయులు, స్టేట్ వీవర్స్ వింగ్ అధికార ప్రతినిధిగా బి.చంద్రమౌళి, జాయింట్ సెక్రటరీగా బి.శ్రీనివాసులును నియమించారు.

1న పదో తరగతి సాంఘిక శాస్త్రం పరీక్ష

కడప ఎడ్యుకేషన్: పదో తరగతి సాంఘిక శాస్త్రం పరీక్షను ప్రభుత్వ ఆదేశాలనుసారం ఏప్రిల్ 1న (మంగళవారం) నిర్వహిస్తున్నట్లు డీఈఓ షేక్ షంషుద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31న రంజాన్ సందర్భంగా ప్రభుత్వం సెలవు దినం ప్రకటించిందని ఆయన పేర్కొన్నారు. కావున ఆ రోజున జరగాల్సిన సాంఘిక శాస్త్రం పరీక్షను 1వ తేదీకి మార్చినట్లు తెలిపారు. ఈ మార్పును విద్యార్థులు, వారి తల్లిదండ్రులతోపాటు ప్రధానోపాధ్యాయులు గమనించాలని కోరారు. ఈ విషయం విద్యార్థులకు చేరేలా ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆయన వివరించారు.

నిరుద్యోగ యువతులకు వృత్తి శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్: కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతులకు టైలరింగ్, బ్యూటీ పార్లర్, ఎంబ్రాయిడరీ, ఫ్యాబ్రిక్ పెయింటింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కెనరా బ్యాంకు రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ ఎం.ఆరీఫ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18–45 ఏళ్ల మధ్య వయసు గల మహిళలు ఈ శిక్షణకు అర్హులని ఆయన పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన యువతులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. దూర ప్రాంతాల వారికి ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్లు:94409 05478. 9985606866, 94409 33028లలో సంప్రదించాలని వివరించారు.




ఈకేవైసీ.. హైరానా..

ఈకేవైసీ (ఎలక్ట్రానిక్ నో యువర్ కస్టమర్) కోసం కార్డుదారులు హైరానా పడుతున్నారు. మూడు రోజుల్లో గడువు ముగుస్తుండటంతో.. రేషన్‌షాపుల వద్ద బారులు దీరుతున్నారు. ఈకేవైసీ చేయించుకోకపోతే కార్డు రద్దు చేస్తారంటూ ప్రచారం జరుగుతుండటంతో.. ఆందోళనకు గురవుతున్నారు.

- కార్డుదారులకు కొత్త కష్టాలు
- ఈకేవైసీ చేయించుకోవాలని ఉత్తర్వులు
- ఈ నెల 31 ఆఖరి గడువు
- రేషన్ షాపుల వద్దకు జనం పరుగు
- లేదంటే కార్డు రద్దు అంటూ ప్రచారం



రామరాజుపల్లెలో రేషన్ డీలర్ వద్ద ఈకేవైసీ కోసం వేచి ఉన్న కార్డుదారులు



కడప సెవెన్‌రోడ్స్: రేషన్ కార్డుల్లో ఉన్న కుటుంబ సభ్యులంతా తమ సమీపంలోని డీలర్ల వద్దకు వెళ్లి ఈకేవైసీ చేయించుకోవాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అందుకు ఈనెల 31వ తేదీ ఆఖరు గడువుగా నిర్ణయించారు. ఏదైనా కారణాల వల్ల ఎవరైనా ఈకేవైసీ చేయించుకోకపోతే.. ఏప్రిల్ నుంచి బియ్యం కార్డుల ద్వారా సరుకులు నిలిపివేస్తారని ప్రకటించడంతో ప్రజల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటి వరకు ఎండీయూ వాహనాల ఆపరేటర్లు ఇంటి వద్దకే వచ్చి బియ్యం పంపిణీ చేస్తుండటంతో.. ప్రజలు డీలర్ల వద్దకు వెళ్లాల్సిన అవసరం ఉండేది కాదు. ఇప్పుడు చాలా మంది డీలర్లు ఎక్కడున్నారో వెతుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. గడువు కేవలం మూడు రోజులే ఉండటంతో ఎఫ్‌పీ షాపు డీలర్ల వద్దకు ప్రజలు పరుగులు పెడుతున్నారు. కార్డుదారులు ఒక్కసారిగా వచ్చి పడటంతో డీలర్లు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. ప్రజలను అదుపు చేయడం కష్టంగా మారిందని పలుచోట్ల డీలర్లు అంటున్నారు. కూలీ పనులు, చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్న వారు.. పనులన్నీ వదిలేసి డీలర్ల వద్ద పడిగాపులు కాస్తున్నారు. రద్దీ అధికంగా ఉండటంతో సర్వర్ సమస్యలు సైతం చోటుచేసుకుంటున్నాయి. దీంతో రాత్రి సమయం వరకు ఈకేవైసీ నిర్వహించాల్సి వస్తోందని డీలర్లు అంటున్నారు. అప్పటికీ మిగిలి ఉన్న కొంత మంది కార్డుదారులను మరుసటి రోజు రావాలని పంపుతున్నారు. మళ్లీ మరుసటిరోజు పనులు వదులుకుని డీలర్ల వద్దకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని ప్రజలు వాపోతున్నారు. చాలా మందికి వేలిముద్రలు పడటం లేదు. సంబంధిత వీఆర్వో లాగిన్‌లో ఫేస్ రికగ్నైజేషన్ ఆప్షన్ ఉంటుందని అధికారులు చెబుతున్నారు. అయితే వీఆర్వోలు అందుబాటులో లేకపోవడంతో వేలిముద్రలు పడని వారు ఇంటిముఖం పడుతున్నారు. మరో వైపు వేలిముద్రలు పడని వారికి ఆధార్ అప్‌డేట్ చేయించుకోవాలని కొందరు డీలర్లు చెబుతున్నారు. దీంతో వారు ఆధార్ కేంద్రాలకు క్యూ కడుతున్నారు. ఇలాంటి వారందరికీ వచ్చే నెల నుంచి బియ్యం అందే పరిస్థితి లేకుండా పోతోంది.

ఈ నెల 15 నుంచి ప్రారంభం : జిల్లాలో 1239 చౌక దుకాణాలు ఉన్నాయి. వీటి పరిధిలో అంత్యోదయ అన్నయోజన కార్డులు 36031 ఉండగా, యూనిట్లు 97,878 ఉన్నాయి. తెల్లకార్డులు (డబ్ల్యూఏపీ) 5,42,746 ఉండగా, అందులో 16,43,489 యూనిట్లు ఉన్నాయి. ఇలా మొత్తం జిల్లాలో 5,78, 777 బియ్యం కార్డులకు గాను 17,41,367 యూనిట్లు ఉన్నాయి. శుక్రవారం నాటికి ఇందులో 15,87,532 యూనిట్లకు ఈకేవైసీ పూర్తి కాగా, 1,43,140 పెండింగ్‌లో ఉన్నట్లు పౌర సరఫరాల అధికారుల గణాంకాలు పేర్కొంటున్నాయి. ఈనెల 30న ఉగాది, 31న రంజాన్ ఉన్నాయి. ప్రజలు పండుగ హడావుడిలో ఉండే అవకాశం ఉంది. ఈ పరిస్థితుల్లో ఎంత మంది ఈకేవైసీ చేయించుకుంటారన్నది చెప్పలేము. జిల్లాలో ఈనెల 15వ తేదీ నుంచి ఈకేవైసీ కార్యక్రమాన్ని చేపట్టారు. పైగా 16 రోజులే గడువు విధించారు.

వలసదారుల ఆవేదన

ఈకేవైసీపై విస్తృత ప్రచారం నిర్వహించి తగినంత గడువు ఇవ్వకుండానే కార్యక్రమాన్ని చేపట్టడంతో సమస్యలు ఉత్పన్నమయ్యాయి. అంతో, ఇంతో చదువుకున్న వారిలోనే చాలా మందికి ఈకేవైసీ చేయించుకోవాలన్న విషయం తెలియదు. ఇక నిరక్షరాస్యుల సంగతి చెప్పాల్సిన అవసరం లేదు. ఇదిలా ఉంటే అనేక మంది ప్రజలు తాత్కాలికంగా ఇతర ప్రాంతాలకు వెళ్లి పనులు చేసుకుని బతుకుతున్నారు. కొంత మంది వేరే ప్రాంతాల్లో చదువుకునే విద్యార్థులు ఉన్నారు. అలాంటి వారు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇది కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమం గనుక దేశంలో ఎక్కడైనా ఎఫ్‌పీ షాపుల వద్ద ఈకేవైసీ చేయించుకునే సౌలభ్యం ఉందని అధికారులు అంటున్నప్పటికీ.. అది ఆచరణలో అమలు కావడం అంత సులభం కాదు. రేషన్‌కార్డు పోతుందనే భయంతో వలసదారులు, విద్యార్థులు ఇంటిముఖం పడుతున్నారు.

గడువు పొడిగించాలి



తక్కువ సమయం ఇచ్చి ఈకేవైసీ చేయించుకోవాలని, లేదంటే రేషన్‌కార్డు పోతుందని ప్రభుత్వం చెప్పడం తగదు. కేవలం 16 రోజుల్లో ఈకేవైసీ చేయించుకోవడం చాలా మందికి అసాధ్యం. ఎందుకంటే కుటుంబ పోషణ కోసం సుదూర ప్రాంతాలకు ఉపాధిని వెతుక్కుంటే వెళ్లిన వారు అనేక మంది ఉన్నారు. అలాగే ఇతర ప్రాంతాల్లో చదువుకునే విద్యార్థులు ఉన్నారు. వీరందరూ గడువులోపు వచ్చి ఈకేవైసీ చేయించుకోవడం కష్టసాధ్యం. కనుక ఈకేవైసీ గడువు పొడిగించాలి.

– కేసీ బాదుల్లా, కడప

వేలిముద్రలు పడక అవస్థలు



ఈకేవైసీ చేయించుకునేందుకు డీలర్ల వద్దకు వెళుతున్న ప్రజల్లో చాలామందికి వేలిముద్రలు పడకపోవడంతో అవస్థలు తప్పడం లేదు. అలాంటి వారికి వీఆర్వో లాగిన్‌లో ఫేస్ రికగ్నైజేషన్ వెసలుబాటు ఉందని అధికారులు అంటున్నప్పటికీ వీఆర్వోలు అందుబాటులో లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేలిముద్రలు పడకపోతే ఇలాంటి ఆప్షన్ ఉందని తెలియని చాలా మంది నిరక్షరాస్యులు ఇంటికి తిరుగుముఖం పడుతున్నారు. ఇలాంటి వారంతా వచ్చేనెల నుంచి కార్డు కోల్పోవాల్సిన పరిస్థితి నెలకొంది. మరికొంత గడువు ఇచ్చి సాంకేతిక పరమైన సమస్యలు లేకుండా చూసి అందరూ ఈకేవైసీ చేయించుకునేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

– కె.మునెయ్య, రామరాజుపల్లె, కడప

కార్డు లేకపోతే సంక్షేమ పథకాలు లేనట్లే



ప్రతి నెల వీధుల్లోకి వచ్చే ఎండీయూ వాహనం వద్ద బియ్యం, చక్కెర, ఇతర సరుకులు తీసుకోవాలంటే రేషన్‌కార్డు ఉండాలి. అలాగే పెన్షన్, పక్కాగృహం, వైద్య సేవలు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన పలు సంక్షేమ పథకాలు అందాలంటే రేషన్‌కార్డు తప్పనిసరి. దారిద్ర్యరేఖకు దిగువ జీవిస్తున్న ప్రజలకు ఎన్నో విషయాల్లో రేషన్‌కార్డు అండగా ఉందన్న విషయం ఎవరూ కాదనలేని సత్యం. అలాంటి రేషన్‌కార్డు రద్దయితే ఆ కుటుంబ జీవనం అల్లకల్లోలంగా మారుతుంది. జిల్లాలో ఇప్పటికే అనేక మంది రేషన్‌కార్డులేని కుటుంబాలు ఉన్నాయి. అర్హులైన వీరందరికీ కొత్త రేషన్ కార్డులు జారీ చేయాల్సిన అవసరం ఉంది. అలా జారీ చేయకపోగా ఈకేవైసీ పేరుతో, తక్కువ గడువు ఇవ్వడమంటే ఉన్న కార్డులను తొలగించడానికేనన్న విమర్శలు సర్వత్రా వెలువడుతున్నాయి. ఎంతమందికి ఈకేవైసీ లేకపోతే అంతమందికి సంక్షేమ పథకాలు అందకుండా పోయే ప్రమాదం ఉంటుంది. కనుక ప్రభుత్వం ఇప్పటికైనా ఈకేవైసీ గడువు పొడిగించాలని ప్రజలు, రాజకీయ పక్షాలు కోరుతున్నాయి.

నిత్యపూజస్వామి హుండీ ఆదాయం లెక్కింపు




నగదు లెక్కిస్తున్న ఉద్యోగులు, భక్తులు

సిద్దవటం: మండలంలోని వంతాటిపల్లె గ్రామ పంచాయతీ లంకమల అడవీ ప్రాంతంలో వెలసిన శ్రీనిత్యపూజ స్వామి హుండీ ఆదాయాన్ని శుక్రవారం లెక్కించారు. రూ. 72,470 వచ్చిందని ఆలయ ఈఓ శ్రీధర్ తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరి 27 నుంచి మార్చి 28వరకు భక్తులు స్వామి వారి హుండీలో వేసిన కానుకలను శుక్రవారం దేవదాయశాఖ రాజంపేట ఇన్‌స్పెక్టర్ జనార్దన్, సిద్దవటం ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు వారు, పోలీసులు, భక్తుల సమక్షంలో లెక్కించినట్లు ఈఓ తెలిపారు. కార్యక్రమంలో ఏపీజీబీ ఫీల్డ్ ఆఫీసర్ వెంకట సురేంద్రబాబు, మెసింజర్ సతీష్, పోలీసు రమణయ్య, ఆలయ ఉద్యోగి చంద్ర, అర్చకులు సుబ్రమణ్యం శర్మ, వంతాటిపల్లెవాసి వెంకటసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

1న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

ఒంటిమిట్ట: ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామ స్వామి ఆలయంలో మంగళవారం ఉదయం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఘనంగా జరగనుంది. ఏప్రిల్ 5 నుంచి 15 వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరగనున్న నేపథ్యంలో.. ముందుగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి అర్చన చేసి, ఉదయం 8 నుంచి 11.30 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో గర్భాలయం, శ్రీ ఆంజనేయస్వామి, శ్రీ గరుత్మంతుని సన్నిధి, ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజా సామగ్రి తదితర అన్ని వస్తువులను నీటితో శుద్ధి చేస్తారు. నామకోపు, శ్రీ చూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర జలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేస్తారు. అనంతరం భక్తులను ఉదయం 11.30 గంటల నుంచి సర్వదర్శనానికి అనుమతిస్తారు.



ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి ఆలయం

వేలమా.. కొనసాగింపా?

హార్సిలీహిల్స్ టోల్‌గేట్ వసూళ్లపై సందిగ్ధం

బి.కొత్తకోట: బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌కు వచ్చే సందర్శకుల నుంచి వసూలు చేసే టోల్ రుసుంపై వేలం పాటలు నిర్వహించి ప్రయివేటుకు అప్పగిస్తారా లేక రెవెన్యూ సిబ్బందితో వసూళ్లు కొనసాగిస్తారా అన్నది స్పష్టం కావడం లేదు. గతేడాది సెప్టెంబర్ 30న మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వేలంపాటలు నిర్వహించగా.. మదనపల్లెకు చెందిన వ్యక్తి రూ.45.20 లక్షలతో రికార్డు స్థాయిలో లీజు దక్కించుకున్నాడు. అక్టోబర్ 18 నుంచి ఏడాది పాటు టోల్ వసూలుకు అప్పగించారు. అయితే ఈ ఏడాది ఫిబ్రవరి 4 వరకు వేలంలో పాడిన సొమ్మును చెల్లించకపోవడంతో ఐదో తేదీన టెండర్ రద్దు చేసి.. 5వ తేదీ నుంచి రెవెన్యూ సిబ్బందితో వసూళ్లు చేయిస్తున్నారు. సాధారణంగా ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న సమయంలో లీజులు, గుత్తలపై మార్చిలో వేలంపాటలను నిర్వహించి ప్రయివేటుకు అప్పగిస్తారు. అయితే హార్సిలీహిల్స్ టౌన్‌షిప్ కమిటీ చైర్మన్ అయిన మదనపల్లె సబ్‌కలెక్టర్ ఇంత వరకు నిర్ణయం తీసుకోలేదు. దీనితో వేలంపాటలు నిర్వహిస్తే పాల్గొనేందుకు సిద్ధంగా ఉన్న పాటదారులు ఎదురు చూస్తున్నారు. గత వేలంలో అత్యధికంగా రూ.45.20 లక్షలకు పాడారు. ఈ పాటను దృష్టిలో పెట్టుకుని అధికారులు తదుపరి వేలంపాటపై నిర్ణయం తీసుకుంటారా.. లేక గత పాటలో నిర్ణయించిన ధర పాటను మొదలు పెడ్తారా అన్నది తేలాలి. కాగా ఫిబ్రవరి 5 నుంచి బి.కొత్తకోట రెవెన్యూ సిబ్బంది టోల్ వసూళ్లు చేస్తున్నారు. రోజుకు మూడు షిఫ్టుల్లో వీఆర్ఏలను నియమించి చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వర్తింపజేస్తున్నారు. వాహనాలకు టోకెన్లు ఇస్తూ ఎంట్రీ ఫీజును వసూలు చేస్తున్నారు. ఇలా వసూలు చేస్తుండటంపై ఎలాంటి ఆరోపణలు, విమర్శలు లేకపోవడంతో.. ఇదే పద్ధతితో కొనసాగిస్తారా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఐదేళ్ల క్రితం వరకు రెవెన్యూ సిబ్బంది ద్వారానే టోల్ వసూలు చేయించేవాళ్లు. తర్వాత ఇద్దరు వీఆర్ఏలు అవినీతికి పాల్పడటంతో వారిని సస్పెండ్ చేశారు. దీనితో సబ్‌కలెక్టర్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో వేచిచూడాలి.

నటించి.. వాయిదా వేయించి..



ఎన్నికల కార్యాలయంలో వాగ్వాదానికి దిగిన టీడీపీ వార్డు సభ్యులు

- గోపవరం ఉప సర్పంచ్ ఎన్నిక మళ్లీ వాయిదా
- వారిలో వారే గొడవకు దిగిన టీడీపీ వార్డు సభ్యులు
- మినిట్స్ బుక్ చించివేత
- వంత పాడిన అధికారులు

ప్రొద్దుటూరు: మండలంలోని గోపవరం గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ ఎన్నిక నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశారు. గురువారం పోలీసు బందోబస్తు ఏర్పాటులో విమర్శలు వెల్లువెత్తడంతో రెండో రోజు పటిష్టంగా నిర్వహించేలా చేశారు. ఉదయం 9 గంటల నుంచే డీఎస్పీ భావన ఆధ్వర్యంలో 144 సెక్షన్, పోలీసు 30 యాక్టు అమలు చేశారు. పెద్ద సంఖ్యలో పోలీసులు మోహరించి కొత్రపాడు రోడ్డులో ట్రాఫిక్‌ను మళ్లించారు. గ్రామ పంచాయతీ కార్యాలయం చుట్టూ అల్లరిమూకలు లేకుండా తరిమేశారు. ముందుగా టీడీపీ వార్డు సభ్యులు ఏడుగురు ఎన్నికలు నిర్వహించే గోపవరం గ్రామ పంచాయతీ కార్యాలయానికి వెళ్లారు. మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి కోరిక మేరకు.. రెండు వాహనాల్లో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి దొరసానిపల్లె నుంచి సర్పంచ్ గద్దా మోషాతోపాటు 13 మంది వైఎస్సార్‌సీపీ వార్డు సభ్యులను గ్రామ పంచాయతీ కార్యాలయానికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా పోలీసు బందోబస్తు ఉన్నా.. టీడీపీ నాయకులు బచ్చల వీరప్రతాప్, ఈవీ సుధాకర్‌రెడ్డి తదితరులు గ్రామ పంచాయతీ కార్యాలయంలోనికి వెళతామని దగ్గరికి వచ్చారు. లోపలికి వెళ్లేందుకు కుదరదని డీఎస్పీ వెనక్కి పంపారు.

మీడియాను అనుమతించకుండా..

ఇంతలోనే ఎన్నికల అధికారి రామాంజనేయరెడ్డి తనకు గుండెపోటు వచ్చిందని గుండె పట్టుకున్నారు.



గుండెపోటు వచ్చిందని పక్క గదిలో కూర్చున్న ఎన్నికల అధికారి రామాంజనేయరెడ్డి

గోపవరం గ్రామ పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ ఆయనను తీసుకొచ్చి తన చాంబర్‌లో కూర్చోబెట్టారు. ఆ సమయంలో ఎన్నికల అధికారి ప్రశాంతంగా కూర్చున్నట్లు లోపల ఉన్న అధికారులే చెబుతున్నారు. అంతలోనే అంబులెన్స్‌ను పిలిపించడం.. ఎన్నికల అధికారి రామాంజనేయరెడ్డిని లోపలి నుంచి నడిపించుకుంటూ బయటికి తెచ్చి అంబులెన్స్ ఎక్కించారు. స్థానికంగా అయితే ఎక్కడ అసలు విషయం బయటపడుతుందని భావించి.. ఎన్నికల అధికారిని కడపలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించినట్లు చెబుతున్నారు. కొంత సేపటి తర్వాత పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ.. ఎన్నికల అధికారికి గుండెపోటు రావడంతో ఎన్నిక వాయిదా పడిందని, కలెక్టర్ ఆదేశాల తర్వాత మళ్లీ ఎన్నిక ఉంటుందని మీడియాకు తెలిపారు. కార్యాలయంలోనికి మాత్రం మీడియాను అనుమతించలేదు. కార్యాలయ ప్రాంగణంలో డీఎస్పీ భావన, ఆర్డీఓ సాయిశ్రీ, తహసీల్దార్ గంగయ్య మాట్లాడుకుంటూ ఉండగానే ఈ వ్యవహారమంతా జరిగింది. తర్వాత పోలీసు బందోబస్తుతో టీడీపీ వార్డు సభ్యులు, అనంతరం వైఎస్సార్‌సీపీ వార్డు సభ్యులను తమ ప్రాంతాలకు పంపించారు.

గుండెపోటు రాజకీయం

ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ఆదేశాల మేరకు గుండెపోటు రాజకీయం జరిగిందని స్థానిక ప్రజలు చెప్పుకొంటున్నారు. గతంలో మున్సిపల్ మాజీ ఇన్‌చార్జి చైర్మన్ వీఎస్ ముక్తియార్ వైఎస్సార్‌సీపీలో ఉండగా.. ఆయనను మున్సిపల్ చైర్‌పర్సన్‌గా చేసేందుకు అప్పట్లో ఎమ్మెల్యేగా ఉన్న రాచమల్లు శివప్రసాదరెడ్డి మద్దతు ఇచ్చారు. ఆ సమయంలో కూడా వరదరాజులరెడ్డి వ్యూహం ప్రకారం.. ఇలాగే వ్యవహరించి ఎన్నికను వాయిదా వేయించారు. ప్రస్తుతం అదే తరహాలో ఉప సర్పంచ్ ఎన్నికను వాయిదా వేయించారని ప్రజలు చర్చించుకుంటున్నారు.

వ్యూహం ప్రకారం గొడవ

ఉదయం 11 గంటల ప్రాంతంలో ఎన్నిక జరగాల్సి ఉండగా ఒక వ్యూహం ప్రకారం ఎన్నికల కార్యాలయంలో టీడీపీకి చెందిన 7వ వార్డు సభ్యురాలు కాచన రామలక్షుమ్మ, ఉపసర్పంచ్ అభ్యర్థి మండ్ల రమాదేవి వాగ్వాదానికి దిగారు. ఒకరినొకరు దూషించుకున్నారు. వీరు గొడవ పడుతుండగానే 8వ వార్డు సభ్యురాలు గాయత్రి ఎన్నికల అధికారి వద్ద ఉన్న మినిట్స్ బుక్‌ను చేతిలోకి తీసుకుని చించి వేశారు. ఈ సందర్భంగానే 5వ వార్డు సభ్యుడు ఆదినారాయణరెడ్డి కుర్చీలు విసిరేశాడు. టీడీపీ సభ్యులైన వీరంతా పరిస్థితి ఉద్రిక్తతంగా ఉందనుకునేలా నటించారు.

మాజీ ఎమ్మెల్యే రాచమల్లు హౌస్ అరెస్టు

గోపవరం గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ ఎన్నిక సందర్భంగా పోలీసులు వైఎస్సార్‌సీపీ నేతలను హౌస్ అరెస్టు చేశారు. మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్లు పాతకోట బంగారు మునిరెడ్డి, ఆయిల్ మిల్ ఖాజా తదితరులకు పోలీసులు ముందస్తు నోటీసులను ఇచ్చి.. ఇంటి నుంచి బయటికి రాకుండా కాపలా ఉంచారు. గురువారం ఎన్నికల కార్యాలయంలోకి దౌర్జన్యంగా వెళ్లిన టీడీపీ నాయకులు బచ్చల వీరప్రతాప్, ఈవీ సుధాకర్ రెడ్డి తదితరులు శుక్రవారం కూడా యథావిధిగా అక్కడికి రావడం గమనార్హం.

వరదది దుర్మార్గపు రాజకీయం



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, ఎమ్మెల్యేలు, జిల్లా నేతలు

- అధికార యంత్రాంగాన్ని అడ్డుపెట్టుకుని కుట్రలు
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి దుర్మార్గపు రాజకీయాలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి విమర్శించారు. గోపవరం గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ ఎన్నిక సందర్భంగా మాజీ ఎమ్మెల్యే రామల్లు శివప్రసాదరెడ్డికి సంఘీభావం తెలిపేందుకు వైఎస్ఆర్‌సీపీ జిల్లా నేతలు శుక్రవారం ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా రవీంద్రనాథ్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ ప్రొద్దుటూరులో 1985లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లోనే బలం లేకున్నా తమ అభ్యర్థిని గెలిపించుకునేందుకు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి.. తన ఇంటిలో పని చేసే మనుషులను ఓటర్లుగా పెట్టిన చరిత్ర ఉందని అన్నారు. అదే తరహాలోనే ప్రస్తుతం గోపవరం గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ ఎన్నికలో జరిగిందన్నారు. నకిలీ ఐడీ కార్డులు సృష్టించి తన ఇంటి మనుషులను వార్డు సభ్యులుగా చేర్చి విజయం సాధించేందుకు చేసిన ప్రయత్నం సఫలం కాలేదన్నారు. విజయం సాధించినట్లు ఫలితం ప్రకటించాలని అధికారులపై ఒత్తిడి తెచ్చినా వీలు కాలేదన్నారు. రెండో రోజు వైఎస్సార్ జిల్లా కలెక్టర్ అధికార పార్టీకి తొత్తుగా వ్యవహరించడంతో ప్రజాస్వామ్యం అపహాస్యం పాలైందన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తాడిపత్రి మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నిక సందర్భంగా కేవలం ఒక టీడీపీ సభ్యుడు ఎక్కువ ఉన్నా.. అప్పట్లో ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయం చేయలేదన్నారు.

ఫేక్ ఐడీల పన్నాగం విఫలం

మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ గోపవరం గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ ఎన్నికకు సంబంధించి నిన్న పోలీసులు, నేడు కలెక్టర్‌ను అడ్డు పెట్టుకుని ఎన్నికను వాయిదా వేశారన్నారు. ప్రతిపక్ష పార్టీకి అడుగు దూరంలో అధికారం దక్కాల్సి ఉండగా, టీడీపీ వ్యూహం ప్రకారం వాయిదా వేయించిందన్నారు. టీడీపీ వార్డు సభ్యులు వారిలో వారే గొడవ పడటం, మినిట్స్ బుక్ చించడం, కుర్చీలు విసరడం, ఎన్నికల అధికారికి గుండెపోటు రావడం అంతా డ్రామా అన్నారు. గురువారం తమ వార్డు సభ్యులపై రాళ్లతో దాడి, కార్లను ధ్వంసం చేశారన్నారు. తమ వార్డు సభ్యులను రక్షించడంలో పోలీసులు విఫలమయ్యారని తెలిపారు. కనీసం ఎన్నికల కార్యాలయానికి తమ సభ్యులను పోలీసులు తీసుకెళ్లలేకపోయారన్నారు. శుక్రవారం అదనపు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి వార్డు సభ్యులందరిని తీసుకెళ్లగా గుండెపోటు డ్రామాతో ఎన్నిక వాయిదా పడిందని తెలిపారు. తమ వార్డు సభ్యులను ఏ ఒక్కరినీ ఆ పార్టీలోకి తీసుకెళ్లలేక పోయారని, దీంతో ఫేక్ ఐడీలతో గెలవాలని చేసిన ప్రయత్నాన్ని తాము అడ్డుకున్నామన్నారు. డీఎస్పీ, ఆర్డీఓ అధికారులు అక్కడే ఉన్నా.. ఎమ్మెల్యే వరద చెప్పినట్టే ఎన్నికను వాయిదా వేశారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మంత్రి పదవులు పొందిన వారు, రాజ్యసభ సభ్యులు పార్టీ మారారని, ఎంత ఒత్తిడి చేసినా తమ వార్డు సభ్యులు నిక్కచ్చిగా వ్యవహరించారన్నారు. సమావేశంలో బద్వేలు, రాజంపేట ఎమ్మెల్యేలు డాక్టర్ సుధ, ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, మైదుకూరు మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి, జెడ్పీ చైర్మన్ ముత్యాల రామగోవిందరెడ్డి, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ జేష్టాది శారదతోపాటు గోపవరం పంచాయతీ వార్డు సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారమే లక్ష్యం

– జిల్లా ఎస్పీ ఈ.జి అశోక్ కుమార్



పోలీసు సిబ్బంది సమస్యలపై వినతి పత్రం స్వీకరిస్తున్న ఎస్పీ ఈ.జి అశోక్‌కుమార్

కడప అర్బన్ : పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారం కోసం జిల్లా ఎస్పీ ఈ.జి అశోక్ కుమార్ శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు 'గ్రీవియన్స్ డే' నిర్వహించారు. జిల్లాలో వివిధ పోలీసు స్టేషన్లు , ఆయా విభాగాలలో విధులు నిర్వర్తిస్తున్న పోలీసు సిబ్బంది బదిలీలు, వ్యక్తిగత , స్పౌజ్, చిల్డ్రన్, మెడికల్ సమస్యల గురించి ఎస్పీకి స్వయంగా విన్నవించుకున్నారు. ఎస్పీ సిబ్బంది సమస్యలను విని, వారి సమస్యలకు తగిన పరిష్కారం చూపుతామని భరోసా కల్పించారు.

పంచాయతీ కార్యదర్శిపై దాడి అమానుషం



సూపరింటెండెంట్ బాలన్నకు వినతి పత్రం ఇస్తున్న పంచాయతీ కార్యదర్శులు

ప్రొద్దుటూరు రూరల్ : వీరపునాయునిపల్లె పంచాయతీ కార్యదర్శి నాగభూషణ్‌రెడ్డి ఇంటిపై కొందరు దుండగులు దాడి చేయడం అమానుషమని మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం ఉపాధ్యక్షుడు మస్తాన్ పేర్కొన్నారు. ఈ మేరకు వారు శుక్రవారం నల్లబ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు జరగకుండా గ్రామ పంచాయతీ కార్యదర్శులకు ఉన్నతాధికారులు భరోసా ఇవ్వాలన్నారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ బాలన్నకు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శుల సంఘం మహిళా ఉపాధ్యక్షురాలు శిరీష, జనరల్ సెక్రటరీ సుహాసిని, అడిషనల్ సెక్రటరీ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆశా కార్యకర్తలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు వేణుగోపాల్ డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని హోచిమన్ భవన్‌లో ఏపీ ఆశా వర్కర్ యూనియన్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆశాలకు ఇచ్చిన హామీలకు జీవోలు విడుదల చేయాలన్నారు. వేతనాలు పెంచాలని, సాధారణ సెలవులు, ఉద్యోగ భద్రత, మెడికల్ ఉద్యోగులుగా గుర్తించి పెర్మనెంట్ చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5 లక్షలు, స్మార్ట్ ఫోన్లు, రూ. 10 లక్షల రూపాయల ఉచిత ప్రమాద ఇన్సూరెన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై ఏప్రిల్ 1వ తేదీ నుండి 21వ తేదీ వరకు ఉద్యమ కార్యచరణ ప్రకటించామన్నారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ నగర అధ్యక్షులు సుబ్బరాయుడు, ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి బి శాంతమ్మ పాల్గొన్నారు.

వాహనం ఢీకొని వృద్ధురాలు మృతి



కడప అర్బన్ : ఉక్కాయిపల్లి సమీపంలోని బైపాస్ రోడ్డు వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వృద్ధురాలు మృతి చెందినట్లు కడప ట్రాఫిక్ సీఐ జావిద్ తెలిపారు. సీఐ వివరాల మేరకు మృతి చెందిన వృద్ధురాలుకు 65 సంవత్సరాలు వయసు ఉంటుందని, గురువారం రాత్రి నడుచుకుంటూ వెళుతున్న ఆమెను వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలతో మృతి చెందినట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించినట్లు తెలిపారు. మృతురాలి సంబంధీకులు వివరాలకు 91211 00539 లేదా కడప ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ వచ్చి వివరాలు తెలుసుకోవాలని కోరారు.

'షాన్‌దార్' రంజాన్ కోసం 'దిల్‌దార్' ఏర్పాట్లు

- వరాల పర్వదినానికి ఎదురుచూపులు
- మార్కెట్లకు రంజాన్ కళ
- కొనుగోలుదారులతో దుకాణాలలో రద్దీ
- ఉట్టిపడుతున్న ఆధ్యాత్మిక వాతావరణం



దుకాణాల వద్ద కొనుగోలుదారుల సందడి



కడప నగరంలోని వైవీ స్ట్రీట్ వద్ద నెలకొన్న రద్దీ

కడప కల్చరల్ : పవిత్ర రంజాన్ మాసం దగ్గరకు వచ్చేసింది. పండుగ నిర్వహణ కోసం వస్తువులు కొనుగోలు చేస్తున్న ముస్లింలతో ప్రధాన మార్కెట్లు సందడిగా మారాయి. సాయంత్రం ఐదు గంటల నుంచి దాదాపు దుకాణాలన్నీ మహిళలతో నిండిపోతున్నాయి. మార్కెట్ ప్రధాన వీధులు కూడా జనసందోహంతో కనిపిస్తున్నాయి.

పవిత్ర మాసం..

మనిషిని ఉన్నతుడిగా తీర్చిదిద్దే మాసం....ఆత్మార్పణతో అల్లాహ్‌కు దగ్గరయ్యే అవకాశం గల మాసం. దివ్య గ్రంథం ఖురాన్ భువికి దిగిన మాసం . ప్రతి ముస్లిం జీవితంలో పట్టలేని ఆనందం కలిగించే మాసం. నెల రోజులపాటు ఆధ్యాత్మిక చింతనతో గడిపే అవకాశం కల్పించిన మాసం రంజాన్. సంవత్సర కాలంపాటు ముస్లింలు ఈ పండుగ కోసం ఎదురుచూస్తారు. అలాంటి ఆనందకరమైన రోజు వరాల వసంతాలను కురిపించే రోజు పవిత్ర రంజాన్ పండుగ కేవలం ఒక్క రోజు తర్వాత రానుంది. దీని కోసం భక్తుల నెల రోజుల నిరీక్షణ ముగియనుంది. ముస్లిం లోకం నెల రోజులపాటు భక్తిశ్రద్ధలతో కఠినంగా ఉపవాస దీక్షలు నిర్వహిస్తున్నారు. మరొక్క రోజు తర్వాత దీక్షలు పూర్తయి ఎదురుచూస్తున్న రంజాన్ పండుగ రానుంది. ఈ పండుగను అత్యంత ఘనంగా నిర్వహించుకోవాలన్న భావనతో ఉన్నంతలో మరువలేని విధంగా గడపాలన్న ఆశతో తగిన ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

మార్కెట్లలో రద్దీ

రంజాన్ పండుగ నిర్వహణ కోసం కొనుగోలు చేసేందుకు వచ్చే వారితో మార్కెట్లు కళకళలాడుతున్నాయి. ముఖ్యంగా జిల్లా కేంద్రమైన కడప నగరంలోని వైవీ స్ట్రీట్‌లో ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచే కొనుగోలుదారుల రద్దీ కనిపిస్తోంది. ఇటీవల ఎండ తీవ్రత పెరుగుతుండడంతో మధ్యాహ్నం 12.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు కొనుగోళ్లు కాస్త పలుచబడుతున్నాయి. సాయంత్రం నుంచి దుకాణదారులు రాత్రి 11 గంటల వరకు కూడా షాపులు తెరిచి పెట్టుకోవాల్సిన అవసరం ఏర్పడింది. వైవీస్ట్రీట్ ప్రధాన రోడ్డు పూర్తిగా ముస్లిం మహిళలే కనిపిస్తున్నారు. ముస్లింలు కుటుంబ సభ్యులతోసహా షాపింగ్ చేసేందుకు తరలి వస్తుండడంతో ఆ రోడ్డులో నడిచేందుకు సమయం పడుతోంది. ముఖ్యంగా ఒకవైపు పండుగ నిర్వహణ కోసం ప్రత్యేక సామగ్రి, మరోవైపు ఇంటిల్లిపాదికి దుస్తులు, పాదరక్షలు కొనుగోలు హడావుడి కనిపిస్తోంది. మరీ ముఖ్యంగా రెడీమేడ్ దుకాణాలలో జనం కిటకిటలాడుతున్నారు. ముఖ్యంగా సెంటు, అత్తరు దుకాణాలు, మెహందీ విక్రయించే దుకాణాలు, సేమియా దుకాణాల వద్ద సందడిగా ఉంది.

పండగ కళ

జిల్లాలోని ముస్లింలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలన్నీ క్రమంగా పండుగ కళను సంతరించుకుంటున్నాయి. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని రాయచోటి, రాజంపేటతోపాటు మన జిల్లాలోని కమలాపురం, ప్రొద్దుటూరు, బద్వేలు, జమ్మలమడుగు తదితర ప్రాంతాలలో మసీదులు, ఈద్గాలకు కొత్త కళ కల్పిస్తున్నారు. ముస్లింలలో భక్తిశ్రద్ధలతోపాటు కొత్త ఉత్సాహం కనిపిస్తోంది. ప్రధాన మార్కెట్లతోపాటు ఇతర మెయిన్‌రోడ్డులోగల దుస్తుల దుకాణాలు కళకళలాడుతున్నాయి. మరోవైపు నిత్యావసర సరుకులు విక్రయించే దుకాణాలలో రద్దీ అలాగే ఉంది. పండ్ల దుకాణాలు, తోపుడు బండ్లపై పండ్లు విక్రయించే ప్రాంతాలలో కూడా రద్దీ కనిపిస్తోంది. హలీం, తదితర ప్రత్యేక ఇస్లామిక్ వంటకాలు విక్రయించే దుకాణాలు రంగురంగుల విద్యుద్దీపాలతో కళకళలాడుతున్నాయి. పలుచోట్ల మసీదులను సైతం విద్యుద్దీపాలతో కనుల పండువగా అలంకరించి ఆరోజున రంగురంగుల కాంతులు వెదజల్లేలా ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి పోరాటం

- జిల్లా ఫ్యాప్టో నూతన కార్యవర్గం ఎన్నిక
- జిల్లా ఫ్యాప్టో ఛైర్మన్‌గా ఇలియాస్ బాష



కడప ఎడ్యుకేషన్ : ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేస్తామని జిల్లా నూతన ఫ్యాప్టో చైర్మెన్ ఇలియాస్‌బాష పేర్కొన్నారు. కడపలోని వీణా విజయరామరాజు ఎస్టీయూ భవన్‌లో మాదన్ విజయ్‌కుమార్ అధ్యక్షతన 'ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో)' వైఎస్ఆర్ కడప జిల్లా నూతన కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశం సందర్భంగా జిల్లా ఫ్యాప్టో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇందులో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమైక్య (ఫ్యాప్టో) జిల్లా చైర్మన్‌గా ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.ఎం.డి ఇలియాస్ బాషా(ఎస్టీయూ), సెక్రటరీ జనరల్‌గా ఆర్.అబ్దుల్లా (ఏ.పీ.టీ.ఎఫ్. 1938),ఆర్థిక కార్యదర్శిగా వి.వి శ్రీనివాసులు రెడ్డి (ఏ.పీ.టీ.ఎఫ్. 257), కో చైర్మన్‌లుగా జి.వి సుబ్బారెడ్డి (హెచ్.ఎమ్.ఏ), జె.రామచంద్ర బాబు (బి.టి.ఎ),ఎం.జుబైర్ అహ్మద్ (రూటా) లు, డిప్యూటీ సెక్రటరీ జనరల్ గా ఎం.విజయకుమార్ (యూటీఎఫ్), వి.శ్యామలా దేవి (ఆప్టా)లను ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలకు పరిశీలకులుగా ఫ్యాప్టో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మల్లు రఘునాథరెడ్డి వ్యవహరించారు. మల్లు రఘునాథ రెడ్డి మాట్లాడుతూ ఈ నూతన కార్యవర్గం రెండేళ్ల పాటు కొనసాగుతుందని తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన

కడప అర్బన్ : సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ పోలీసు అధికారులు శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఈ.జి అశోక్ కుమార్ ఆదేశాలతో సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ మధుమల్లేశ్వర రెడ్డి, చిన్న చౌకు సీఐ ఓబులేసు, ఎస్.ఐ రాజరాజేశ్వర రెడ్డి, సైబర్ క్రైమ్, ఏ.ఆర్ సిబ్బంది నగరంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా విస్తృతంగా అవగాహన కల్పించారు. కడపలోని చిన్న చౌకు పోలీస్ స్టేషన్ నుండి ప్రారంభమైన ర్యాలీ అప్సర సర్కిల్, వై జంక్షన్, డా.అంబేడ్కర్ సర్కిల్ మీదుగా వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. సైబర్ నేరం జరిగిన తక్షణమే 1930 కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని కోరారు.



సైబర్ నేరాలపై అవగాహన ర్యాలీలో పోలీసు అధికారులు, సిబ్బంది

మందక్రిష్ణ మాదిగ చంద్రబాబు తొత్తు

సోషల్ వెల్ఫేర్ బోర్డు మాజీ ఛైర్మన్ పులి సునీల్ కుమార్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పులి సునీల్ కుమార్

కడప కార్పొరేషన్ : మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షుడు మందక్రిష్ణ మాదిగ సీఎం చంద్రబాబుకు తొత్తు అని వైఎస్సార్‌సీపీ నేత, సోషల్ వెల్ఫేర్ బోర్డు మాజీ ఛైర్మన్ పులి సునీల్ కుమార్ విమర్శించారు. శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల మందక్రిష్ణ మాదిగ వర్గీకరణ అంశంపై మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వేలెత్తి చూపేలా మాట్లాడటం సరికాదన్నారు. వర్గీకరణ అంశం ముందుకు పోవడానికి వైఎస్సార్ సహకరించారని, ఆయన అకాల మరణం తర్వాత అది మరుగున పడిందని మాట్లాడిన నోటితోనే రాజకీయ నాయకులను మించి విమర్శలు చేయడం దారుణమన్నారు. వర్గీకరణ చేయమని అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వాన్ని అడక్కుండా, ప్రతిపక్షంలో ఉన్న వైఎస్ జగన్‌ను కోరడం సరికాదన్నారు. సుప్రీం కోర్టు నిర్ణయానికి కట్టుబడి ఉంటామని వైఎస్సార్‌సీపీ స్పష్టంగా చెప్పినప్పటికీ మళ్లీ వైఖరి చెప్పాలనడం విచిత్రంగా ఉందన్నారు. ఎస్సీ కులంలో ఎవరైనా పుట్టాలని కోరుకుంటారా అని గతంలో చంద్రబాబు అన్నప్పుడు, ఎస్సీలు స్నానం చేయరు, శుభ్రంగా ఉండరు అని ఆయన మంత్రులు మాట్లాడినప్పుడు మందక్రిష్ణ మాదిగ కనీసం ఖండించలేదన్నారు. ఆయన వర్గీకరణపై తప్పా దళితుల సమస్యలు, వారి ఇబ్బందుల గూర్చి ఏనాడు పోరాడలేదన్నారు. ఇప్పుడు కూడా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మెప్పు కోసం వైఎస్ జగన్‌ను ఇరుకునపెట్టేలా మాట్లాడారన్నారు. వైఎస్ జగన్ మాదిగల పక్షపాతిగా ఎస్సీల్లో మూడు వర్గాలకు ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేసి, మాదిగలకు మంత్రి పదవులు, కార్పొరేషన్ ఛైర్మన్ల పదవులు ఇచ్చారన్నారు. ఇప్పుడు మాదిగలకు చంద్రబాబు ఎన్ని పదవులు ఇచ్చారో బేరీజు వేయాలన్నారు. గతంలో అన్ని ప్రభుత్వాలు మాదిగలను ఓటు బ్యాంకుగా మాత్రమే ఉపయోగించుకున్నాయని, ఒక్క వైఎస్ జగన్ మాత్రమే వారికి మేలు చేశారని తెలిపారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర కార్యదర్శి త్యాగరాజు, జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, నగర అధ్యక్షుడు కంచుపాటి బాబు, రవి తదితరులు పాల్గొన్నారు.

డీఈఓ కార్యాలయం ఎదుట ఆందోళన



డీఈఓ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఆర్ఎస్ఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : పదవ తరగతి గణిత ప్రశ్నాపత్రం లీకేజీ సూత్రధారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు డి.ఎం.ఓబులేసు యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం డీఈఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా డీఓం ఓబులేసు మాట్లాడుతూ ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యం స్వలాభం కోసం ప్రశ్నాపత్రం లీకేజ్ చేశారని ఆరోపించారు. తక్షణం అధికారులు స్పందించి ప్రశ్నాపత్రం లీకేజీపై సమగ్రంగా విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు నవీన్, జిల్లా కార్యదర్శి రెడ్డి సాయి, నాయకులు సన్నీ, హరి, శశి, భార్గవ్, హరికృష్ణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దాల్మియా దరఖాస్తును తిరస్కరించాలి

ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామ సుబ్బారెడ్డి

జమ్మలమడుగు : 'దాల్మియా ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా రైతుల సమస్యలు, బాధలు కలెక్టర్ స్వయంగా విన్నారు. అయితే విస్తరణ పనుల వల్ల గ్రామాలకు ఎటువంటి సమస్యలు ఉన్నాయని ప్రశ్నిస్తే దాల్మియా యాజమాన్యం మాత్రం ఎటువంటి సమస్యలు లేవంటూ దరఖాస్తులో తప్పుడు నివేదిక ఇచ్చిందని.. ఈ కారణం చూపుతూ కలెక్టర్ శ్రీధర్ చెరకూరి దాల్మియా పరిశ్రమ విస్తరణ కోసం పెట్టుకున్న దరఖాస్తును వెంటనే తిరస్కరించాలి' అని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి మాట్లాడారు. ప్రజాభిప్రాయ సేకరణ బాధిత గ్రామాల్లో కాకుండా దాల్మియా ఫ్యాక్టరీలో నిర్వహించడం ఏమిటని ప్రశ్నించారు. అధికారులు దాల్మియా యాజమాన్యంతో లాలూచి పడి ప్రజాభిప్రాయ సేకరణ చేయడం ప్రజలను మోసం చేయడమే అవుతుందన్నారు. నిజంగా దాల్మియా విస్తరణ పనులు చేపట్టాలంటే మొదటి దశలో నిర్మించిన దాల్మియా ఫ్యాక్టరీ వల్ల ఇబ్బందులు పడుతున్న దుగ్గనపల్లి, నవాబుపేట, చిన్నకొమెర్ల, తలమంచిపట్నం గ్రామాల సమస్యలను పూర్తిగా పరిష్కారం చూపించాలన్నారు. దాదాపు 400 ఎకరాల భూమి ప్రతి ఏడాది వరదల వల్ల నాశనం అవుతుందని.. అసలు వ్యవసాయానికి పనికిరాకుండా పోయిందని రైతులు కలెక్టర్ ముందు ఫోటోలతో సహా వివరించారు. అయితే కలెక్టర్ నుంచి ఎటువంటి సమాధానం రాలేదన్నారు. రైతులకు సంబంధించిన భూములకు పరిహారం ఇస్తామన్న మాట ఎక్కడా పలుకలేదన్నారు. బుధవారం రాత్రే అధికారులు, దాల్మియా యాజమాన్యం గ్రామాల్లోకి వెళ్లి ప్రజాభిప్రాయ సేకరణపై తప్పుడు సమాచారం ఇచ్చారన్నారు. ఉదయం 9 గంటలకు సమావేశాన్ని నిర్వహిస్తామని పర్యావరణ శాఖ చెబితే అధికారులు, దాల్మియా యాజమాన్యం మాత్రం కలెక్టర్ వచ్చే సరికి 12 గంటలు అవుతుంది.. ఆ సమయానికి రావాలంటూ చెప్పడం చూస్తుంటే అధికారులు ఎవరికి కొమ్ముకాస్తున్నారో తెలుస్తోందన్నా రు. ప్రజలు ఇబ్బందులు పడుతున్నామని లోకయుక్తకు వెళితే దుగ్గనపల్లి గ్రామాన్ని మార్చటానికి దాల్మియా విధిలేని పరిస్థితుల్లో ఒప్పుకుందన్నారు. అయితే వారికి పరిహారం ఇచ్చి వారికి ఇష్టమైన ప్రాంతంలో గ్రామాన్ని నిర్మించేవరకు స్థానిక ప్రజలకు నమ్మకం లేకుండా పోతోందన్నారు. బాధిత గ్రామాలకు కలెక్టర్ న్యాయం చేయాలనుకుంటే విస్తరణ కోసం దాల్మియా పెట్టుకున్న దరఖాస్తును వెంటనే రిజక్టు చేసి ప్రజల సమస్యలు పరిష్కారం చేసి రెండో ప్లాంట్ విస్తరణ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చిన్న కొమెర్ల సర్పంచ్ జగదీశ్వరరెడ్డి, వినయ్‌రెడ్డి, భాస్కర్ రెడ్డి , మాజీ సర్పంచ్ శివశంకర్ రెడ్డి పాల్గొన్నారు.

అప్పులబాధ తాళలేక యువకుడు ఆత్మహత్య



చంద్రకుమార్ మృతదేహం

బద్వేలు అర్బన్ : అప్పులబాధ తాళలేక యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం బద్వేలులో వెలుగు చూసింది. ఇందుకు సంబంధించి వివరాల్లోకి వెళితే.. పట్టణంలోని పెద్ద అగ్రహారం గ్రామానికి చెందిన పగడాల చంద్రకుమార్ (36) బద్వేలులో టీ దుకాణం నిర్వహిస్తుండేవాడు. ఇతనికి భార్య సుమతితో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు. టీ దుకాణం ఏర్పాటు చేసుకునే సమయంలో చేసిన అప్పులతో పాటు దుకాణం సక్రమంగా జరగకపోవడంతో చేసిన అప్పులు తడిసి మోపెడయ్యాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 26న ఓ పని నిమిత్తం కడపకు వెళుతున్నానని భార్యకు చెప్పి ఇంటి నుండి వచ్చేశాడు. అదే రోజు నెల్లూరు రోడ్డులోని బైపాస్ రోడ్డు సమీపంలో గల ఓ లాడ్జిలో గది అద్దెకు తీసుకుని ఉన్నాడు. అయితే రెండు రోజులుగా లాడ్జిలోని గది తలుపు తీయకపోవడం, గదిలో నుండి దుర్వాసన వస్తుండటంతో లాడ్జి యజమాని పోలీసులకు సమాచారమిచ్చాడు. వారు వెళ్లి తలుపులు తెరిచి చూడగా మృతిచెంది ఉన్నాడు. మృతదేహం పక్కన పురుగుల మందు డబ్బా కనిపించడంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని పోలీసులు నిర్ధారణకు వచ్చారు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మృతదేహాన్ని చూసి బోరున విలపించారు. మృతుని భార్య సుమతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అర్బన్ ఎస్ఐ ఎం.సత్యనారాయణ కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

వ్యసనాలకు బానిసై..



ప్రేమ్‌సాయిరెడ్డి మృతదేహం

ప్రొద్దుటూరు క్రైం : చెడు వ్యసనాలకు లోనైన ప్రేమ్ సాయిరెడ్డి (23) అనే యువకుడు తెలిసిన వారి దగ్గర సుమారు రూ. 8 లక్షల వరకు అప్పులు చేశాడు. బాకీ ఎలా తీర్చాలో అర్థం కాక తీవ్ర మనస్థాపం చెందిన ఆ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రామేశ్వరంలోని కాకనూరు నాగేశ్వరరెడ్డి కిరాణాషాపు పెట్టుకొని జీవనం సాగించేవాడు. ఆయనకు కుమారుడు ప్రేమ్‌సాయిరెడ్డితో పాటు కుమార్తె ఉన్నారు. కుమారుడు బిటెక్ చదువుతూ మధ్యలో మానేసి హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేసేవాడు. ఇటీవలే హైదరాబాద్‌లో ఉద్యోగం మానేసి కడపలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో ప్రైవేట్‌గా పని చేసేవాడు. అతను చెడు వ్యసనాలకు లోనై తల్లిదండ్రులకు డబ్బులు పంపమని అడిగేవాడు. అంతేగాక తెలిసిన వారి వద్ద కూడా సుమారు రూ. 8 లక్షల వరకు అప్పు చేశాడు. అప్పు ఎలా తీర్చాలా తరచూ ఆలోచిస్తూ బాధపడుతూ ఉండేవాడు. రెండు రోజుల క్రితం ప్రేమ్‌సాయిరెడ్డి ప్రొద్దుటూరుకు వచ్చాడు. ఇంటికి వచ్చినప్పటి నుంచి ఏదో ఆలోచిస్తూ దిగులుగా ఉండేవాడు. శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో రేకుల కప్పునకు ఉన్న ఇనుప పైపులకు చీరను కట్టుకొని ఉరేసుకున్నాడు. తర్వాత గుర్తించిన కుటుంబ సభ్యులు ప్రేమ్‌సాయిరెడ్డిని వెంటనే ప్రైవేట్ హాస్పిటల్‌కు తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యుడు తెలిపాడు. తండ్రి నాగేశ్వరరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్ టౌన్ పోలీసులు తెలిపారు.

కడుపునొప్పి తాళలేక డిగ్రీ విద్యార్థి..



రాజశేఖర్ మృతదేహం

కడప అర్బన్ : కడప నగరం రామరాజు పల్లెలోని ఎస్సీ కాలనీకి చెందిన డిగ్రీ బీకాం ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడినట్లు తాలూకా సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. సీఐ వివరాల మేరకు రామరాజు పల్లెకు చెందిన రాజశేఖర్ (24) గత ఏడాది నుండి కడుపునొప్పితో బాధపడుతుండేవాడని తెలిపారు. కడుపు నొప్పి తగ్గకపోవడంతో తీవ్ర మనస్థాపానికి చెంది శుక్రవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యాన్ కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృత దేహాన్ని రిమ్స్‌కు తరలించారు. మృతుడి బంధువులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

కార్మికుల పక్షపాతి వైఎస్సార్‌టీయూసీ



వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు



వైఎస్సార్‌టీయూసీ జెండా ఎగురవేస్తున్న జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి
- ఘనంగా వైఎస్సార్‌టీయూసీ ఆవిర్భావ దినోత్సవం

కడప కార్పొరేషన్ : వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (వైఎస్ఆర్ టీయూసీ) కార్మికుల పక్షపాతి అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్‌టీయూసీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు జాషువా, నగర అధ్యక్షుడు ఏ1 నాగరాజు ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి, మేయర్ కె. సురేష్ బాబులతో కలిసి ఆయన జెండా ఎగురవేశారు. అనంతరం కార్మికుల మధ్య కేక్ కట్ చేసి, వారికి తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీకి ఓ చరిత్ర ఉందని, పోరాటాల నుంచి ఆ పార్టీ పుట్టిందన్నారు. ఉద్యోగులు, కార్మికుల సంక్షేమం కోసం వైఎస్సార్‌టీయూసీ ఆవిర్భవించిందన్నారు. వైఎస్సార్‌టీయూసీ పోరాటాల ఫలితంగా గత ఐదేళ్లలో కార్మికులకు ఎన్నో రకాల మేలు జరిగిందన్నారు. ఏజెన్సీలు కార్మికులను ఇబ్బంది పెట్టకుండా ప్రభుత్వ ఆధ్వర్యంలో ఔట్ సోర్సింగ్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి క్రమం తప్పకుండా ఒకటోతేది వేతనాలు జమ చేసిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. అబద్ధాలు, మోసాలతో సాగుతున్న కూటమి ప్రభుత్వంపై పోరాటానికి ట్రేడ్ యూనియన్ నాయకులు సిద్ధం కావాలన్నారు.

- కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి మాట్లాడుతూ కార్మికుల ఐక్యత, అభివృద్ధి, సంక్షేమం కోసం వైఎస్సార్‌టీయూసీ ఏర్పడిందన్నారు. గత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ 40 శాతం ఓట్లు సాధించడంలో వైఎస్సార్‌టీయూసీ పాత్ర ఎంతో ఉందన్నారు. కార్మికులకు ఎక్కడ అన్యాయం జరిగినా యూనియన్ నాయకులు ముందుండి పోరాడాలని పిలుపునిచ్చారు.
- ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ ఛైర్మెన్ బాలయ్య, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పులి సునీల్, మేసా ప్రసాద్, దాసరి శివ ప్రసాద్, సీహెచ్ వినోద్, వెంకటేశ్వర్లు, టీపీ వెంకట సుబ్బమ్మ, రత్నకుమారి, మరియలు, క్రిష్ణవేణి, సుశీలమ్మ, మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత



ప్రయాణికుల సమస్యలు తెలుసుకుంటున్న గోపాల్ రెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం స్థానిక ఆర్ఎం కార్యాలయంలో గోపాల్‌రెడ్డి డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమాన్ని నిర్వహించారు. • గాలివీడుకు చెందిన వెంకట రమణ కదిరి నుంచి తిరుపతికి వయా ఎన్‌పీ కుంట, గాలివీడు, రాయచోటి మీదుగా బస్సును నడపాలని కోరారు. • మాధవరానికి చెందిన మునెయ్య కొత్త మాధవరం, మాధవరం-1లో ఎక్స్‌ప్రెస్ బస్సులకు రిక్వెస్ట్ స్టాప్ ఏర్పాటు చేయాలన్నారు. • అగుదూరుకు చెందిన రమణ, రాజాలు ప్రొద్దుటూరు–సంతకొవ్వూరు మధ్య తిరుగుతున్న సర్వీసును అగడూరు వరకు పొడిగించాలన్నారు. • బుక్కాయపల్లె రామమునిరెడ్డి దువ్వూరు మండలం బుక్కాయపల్లె గ్రామానికి ప్రొద్దుటూరు లేదా మైదుకూరు డిపో నుంచి బస్సు నడపాలన్నారు. • జమ్మలమడుగుకు చెందిన సాయిచంద్రారెడ్డి ప్రొద్దుటూరు–జమ్మలమడుగు నాన్‌స్టాప్ బస్సులకు బుకింగ్ కండక్టర్లు త్వరితగతిన టిక్కెట్లు జారీ చేసేలా చూడాలని కోరారు. ఆయా సమస్యలను ఆర్ఎం సంబంధిత డిపో మేనేజర్లకు బదిలీ చేసి వాటి పరిష్కరించాలని చొరవ చూపాలని సూచించారు.